మున్సిపల్ అధికారుల దాడులు

సీసీసీ నస్పూర్/శ్రీరాంపూర్, జూలై 30 : నస్పూర్ మున్సిపాలిటీలో మంగళవారం అధికారులు పలు షాపులపై దాడులు చేశారు. ప్లాస్టిక్ వాడుతున్న పలు షాపులకు జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ ఆదేశాల మేరకు అధికారులు వివిధ మద్యం, కిరాణ దుకాణాల్లో ప్లాస్టిక్ వస్తువుల కోసం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 4 మద్యం దుకా ణాలు, 2 బేకరీలు, ఒక కిరాణ షాపులో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం ప్రకారం వీరికి రూ.5000 జరిమానా విధించారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం నిషేధించడం జరిగిందని, వ్యాపారస్తుల కు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దండు తిరుపతి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, భానుచందర్ పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఇన్‌చార్జి కమాండెంట్

హాజీపూర్, జూలై 30 : రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు (ఐపీఎస్)ను ఇటీవల బదిలీ పై వచ్చిన 13వ బెటాలియన్ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాడెంట్ పి వెంకటరాములు మంగళవారం కమిషనర్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా హాజీపూర్ మండలంలోని గుడిపేటలో ఉన్న13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను సందర్శించాలని పోలీస్ కమిషనర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని కమోడెంట్ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ

సభ్యత్వ రసీదుఅందజేస్తున్నరాష్ట్ర ఉపాధ్యక్షుడు

దండేపల్లి, జూలై 30 : ఉపాధ్యాయ సమస్యల సాధనలో పీఆర్టీయూ తెలంగాణ ముందుంటుందని రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సంగర్వ్ రాజేశ్వర్‌రావు అన్నారు. 2024 పీఆర్టీయూ తెలంగాణ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం దండేపల్లి మండలంలోని పలు పాఠశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పానుగంటి లచ్చన్న, బోయిని శ్రీనివాస్, చిట్ల రాజన్న, దాసరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, జూలై 30: కాగజ్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నా కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటి ఆవరణలో చేపట్టిన ఆరవ రోజు నిరసన కార్యక్రమానికి హాజరై మంగళవారం మద్దతూ తెలిపారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు చెల్లించపావడం, ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యతో సతమతమవుతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం కన్వినర్ శ్యాంరావు, నాయకులు ఓదెలు, సలీం, మనోహర్, రాజ్‌కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, జూలై 30 : దివ్యాంగుల సమాజాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ క్షమాపన చెప్పాలని, ఆమే పై శాఖ పరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని చైతన్య దివ్యాంగుల సంక్షేమా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ ఇక్కడ చైతన్య దివ్యాంగుల సంక్షేమా సంఘం డివిజన్ అధ్యక్షుడు ఖయ్యూం, సభ్యులు ముజీబ్, అంజత్, సత్యానారాయణ, పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అప్నాబజార్ దగ్ధం

కాగజ్‌నగర్, జూలై 30 : పట్టణంలోని ఇందిరామార్కెట్‌లోని అప్నా బాజర్ సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రాత్రి వేళలో దుకాణం నుంచి పోగలు రావడంతో గమనించిన స్థానికులు యాజమాని షఫీకి సమాచారం అందించారు. స్థానికులు మంటలు చల్లార్చుడానికి యత్నించినప్పటికి దుకాణంలోని సామాగ్రి మొత్తం కాలిబూడిదైంది. దుకాణంలో సుమారు రూ.8 లక్షల వస్తూ సమాగ్రి కాలిపోయిందని వాపోయారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి : బీజేపీ

మంచిర్యాల (ఏసీసీ), జూలై 30: బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా బీజేపీ నాయకులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. గతంలో కామారెడ్డిలో బీసీల కోసం బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చిందని, అయితే దాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు బొద్దున మల్లేశ్ విమర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో బీసీలకు తక్కు అమౌంట్ కేటాయించారని దీనిని నిరసిస్తూ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో యెనగందుల క్రిష్ణమూర్తి, కొండపాక చారి, పల్ల రమేశ్, మదం మల్లేశ్, సత్రం రమేశ్ పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 30 : బీసీ కులగణన వెంటనే చేపట్టాలని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చాప్పిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 50 వేల కోట్లు కేటాయించి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ - ఇద్దరికి గాయాలు

భీమారం, జూలై 30 : మండల కేంద్రంలోని స్థానిక ఆరెపల్లి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం జరుగగా ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఇద్దరు మైనార్లు బైక్‌పై ఆరెపల్లి వైపు నుంచచి అతివేగంగా వచ్చి, అరెపల్లికి వెళ్తున్న బైక్ ఢీ కొనడంతో మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన నక్క సురేశ్‌తో పాటు, మిర్యాల సురేశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. కాగ మైనర్లు అక్కడ నుంచి పారార్ అయ్యారు. క్షతగాత్రులను పోలీస్‌లు మంచిర్యాల దవాఖానకు తరలించారు.

ఇంటి పెరడులో గంజాయి మొక్కలు

కాసిపేట(తాండూర్), జూలై 30 : గంజాయి మొక్కలు పెంచితే తాను తాగడంతో పాటు అమ్మితే డబ్బులు వస్తాయనే ఆశతో ఏకంగా ఇంటి పెరడులోననే గంజాయి మొక్కలు పెంచుతూ పోలీసులు పట్టుకున్న సంఘటన తాండూర్ మండలంలోని బెజ్జాల గ్రామంలో చోటు చేసుకుంది. మాదారం ఎస్ఐ సౌజన్య తెలిపిన కథనం మేరకు... బెజ్జాల గ్రామానికి చెందిన కోట్నాక కేశవరావు అనే వ్యక్తి పెరడిలో కొన్ని మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం మేరకు వాటిని పరిశీలించగా గంజాయి మొక్కలుగా గుర్తించినట్లు, దీంతో పాటు అక్కడ పక్కన ప్లాస్టిక్ సంచిలో కొంత గంజాయి ఆరబెట్టి ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. విచారించగా మూడేళ్లుగా గంజాయి తాగుడుకు అలవాటు పడి, తన సంపదన గంజాయి కొనడానికి, త్రాగడానికి, కుటుంబ పోషణకు సరిపోక బానిసై ఇంట్లోనే గంజాయి పెంచాలని అనుకొని తాగడంతో పాటు డబ్బులు వస్తాయని ఆశతో గంజాయికి ఉన్న విత్తనాలు తీసి పెరడి స్థలంలో వేసి అక్రమంగా పెంచాడు. మొక్కలు మూడు ఫీట్లు పెరగడంతో తుంచి ఆరబెట్టి అమ్ముతున్నాడని తెలిపారు. ఈ మేరకు గంజాయి మొక్కలను, గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో సయ్యద్ తన్వీర్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల మనోభావాలను కించపరుస్తున్న యూట్యూబ్ చానల్స్‌ను నిలిపివేయాలి

కలెక్టర్‌కు, రామగుండం సీపీకి, వినతి పత్రం అందజేసిన పాస్టర్‌లు

కాసిపేట : కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా పాస్టర్లు

నస్పూర్/కాసిపేట, జూలై 30 : క్రైస్తవుల మనోభావాలను కించ పరుస్తున్న యూట్యూబ్ చానల్స్‌ను నిలిపివేయాలని కోరుతూ మంచిర్యాల జిల్లా పాస్టర్ అసోసియేషన్ నాయకులు మంగళ వారం కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ శ్రీనివాస్‌కు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ ఐపీఏఎంఆర్ ప్రెసిడెంట్ ఎస్ శ్యామ్యూల్, ప్రధాన కార్యదర్శి మ్యాథ్యూస్ ఎంజార్జ్, ఉపాధ్యక్షుడు కే ప్రసాద్, ఏసుదాస్‌లు మాట్లాడుతూ క్రైస్తవ మతాన్ని కించప రుస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌ను నిలిపివేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరి మతాన్ని విమర్శించకుండా ఒక వేల అదే విధంగా చేస్తే ఆ ఛానల్స్‌ను నిలిపివేయాల్సిందిగా చర్యలు తీసుకోవాలనికోరారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్యామ్యూల్, ప్రసాద్, ఏసుదాస్, రాజేష్, మ్యాతువ్, జార్జ్, జోషి, అనిల్‌కుమార్, రవికుమార్, బెల్లంపల్లి మండల ఇన్‌చార్జి రాజేష్, సంఘం నాయకులు అనీల్ కుమార్, ముత్తినేని రవి కుమార్, పాస్టర్లు కర్ణాకర్, లూక్ జాన్, సుధాకర్, జ్యోషి, అప్పారావు, సాల్మన్, సామ్యూల్ పాల్గొన్నారు.

'మహిళ శక్తి' ని వినియోగించుకోవాలి

నస్పూర్, జూలై 30 : మహిళ శక్తి పథకం సద్వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో డీఆర్డీవో కిషన్‌తో కలిసి జిల్లా మహిళా సమాఖ్య, మండలాల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. మహిళ శక్తి పథకానికి లబ్ధిదారులను ఆయా సంఘాల సభ్యులే ఎంపిక చేయాలన్నారు. ఈ పథకం కింద ఉపాధి అవకాశాలను వివరించారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 30: నిరుద్యోగ యువతకు టాస్క్ ఆధ్వర్యంలో అందించనున్న బ్యాంక్ పోటీ పరీక్షల ఉచిత శిక్షణతరగతులను సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ రీజినల్ మేనేజర్ సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి టాస్క్ ఆధ్వర్యంలో బ్యాంకు సంబంధిత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా కేంద్రంలోని ఈ టాస్క్ రీజినల్ సెంటర్ నెంబర్ 95027 86438 ను సంప్రదించాలని సూచించారు.

డిప్యూటీ తహసీల్దార్ కు వీడ్కోలు

పెంచికల్ పేట్, జూలై 30 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సరిత ఇటీవల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీస్‌కు బదిలీ కాగా మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐలు గోపాల్,సురేశ్ జూనియర్ అసిస్టెంట్లు ఉదయ్, పద్మ, నారాయణ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి, జూలై 30: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కెరమెరి విద్యుత్‌శాఖ ఏఈ మందపెల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్‌లోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేస్తున్నారన్నారు. దీంతో మండలంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వాంకిడి,జూలై 30 : టాటా మ్యాజిక్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు వాంకిడి ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్‌కు చెందిన జి.గోపాల్ అనే వ్యక్తి టిఎస్ 01యుబి 5626 నంబరు గల టాటా మ్యాజిక్ వాహనంలో మండలంలోని ఖమాన గ్రామంలో ప్రజల నుంచి (10.50క్వింటాళ్లు)ప్రభుత్వ రాయి తీ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న క్రమంలో వాహనం పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనంతో పాటు పట్టుబడిన 10.50 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

వాంకిడి, జూలై 30 : మండలంలోని చిన్న బెండార గ్రామం శివారులో మంగళవారం సాయంత్రం పేకాట స్థావరాలపై వాంకిడి ఎస్ఐ సాగర్ దాడులు నిర్వహించారు. చిన్న బెండార శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని వాంకిడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1240/- నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

రెబ్బెన, జూలై 30: యువత చేడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిచి అందరికి అదర్శంగా ఉండాలని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని సోనాపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామస్థులతో సమావేశం అయి గంజాయి, గుట్కా, గుడుంబా, జూదం, సైబర్ నేరాలు, డయల్ 100 గురించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు.

విద్యార్థులకు అవగాహన

నస్పూర్, జూలై 30 : ప్రభుత్వ సాంఘీక సంక్షేమకళాశాల వసతి గృహంలో మంగళవారం డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు లీగల్ అవేర్‌నెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సంధాని, సదయ్య, రాములు, వసతి గృహ సంక్షేమాధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

హాజీపూర్, జూలై 53 : వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడుపరాదని హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ అన్నారు. మంగళవారం పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎస్సైతో పాటు ఏఎస్సై ఎస్కె చాంద్, హెడ్ కానిస్టేబుల్ కులకర్ణితో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీసీసీ నస్పూర్, జూలై 30: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ సూచించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్‌ల సూచనల మేరకు మంగళవారం సాయంత్రం సీసీసీ కార్నర్ వద్ద వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

సీఎంకు లేఖలు

మందమర్రి, జూలై 30 : మందమర్రి మున్సిపాలిటీకి పాలక వర్గం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఎన్నికల సాధన జేఏసీ సభ్యులు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉత్తరాలు పంపించారు. మందమర్రి మున్సిపాలిటీగా ఏర్పడి మూడు దశాబ్దాలు గడచినా పాలక వర్గం లేక పరిపాలన అస్తవ్యస్థంగా మారిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గుడికందుల రమేశ్, పాలమాకుల భీంసేన్, రామంచ తిరుపతి, బుబత్తుల శ్రీనివాస్, మాయ శ్రీనివాస్, ముజాహిద్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన

మందమర్రి రూరల్, జూలై 30 : మండలంలోని బొక్కలగుట్ట గ్రామ పంచాయతీలో మండల ప్రత్యేక అధి కారి ఖాసిం, ఎంపీడీవో రాజేశ్వర్‌తో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను సందర్శించారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఖాతాలను అందిస్తున్న పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాథోడ్ రామారావు

చెన్నూర్ రూరల్, జూలై 30 : మండలంలోని ప్రజలు తపాలశాఖ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాథోడ్ రామారావు తెలిపారు. మండలంలోని అంగ్రాజ్ పల్లి గ్రామంలోని తపాల కార్యాలయంలో బీపీఎం బీమిని రాజాగౌడఖ ఆధ్వర్యంలో డక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాథోడ్ రామారావు హాజరయినారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ పోస్టుమాస్టర్ లక్ష్మీ నారాయణ, పట్టణ పీఎం గుర్రం మహేష్, సిబ్బంది శ్రావన్, భరత్ తదితరులు పాల్గొన్నారు..

గంట పాటు కుండపోత వర్షం

పెంచికల్ పేట్, జూలై 30 : మండల వ్యాప్తంగా మంగళవారం గంట పాటు కుండపోత వర్షం కురిసింది. గత 15 రోజులకు కురిసిన వర్షానికి ఉదయం భానుడు పూర్తిస్థాయిలో ప్రజలకు దర్శనమిచ్చాడు. దీంతో రైతులు పంట పొలాలకు పురుగు మందు పిచికారి చేశారు. మధ్యాహ్నం కుండపోత వర్షం కురవడంతో అది కాస్త వర్షార్పణం అయిపోయింది.

సిర్పూర్(టీ), జూలై 30 : మండలంలోని పలు గ్రామాలతో పాటు మండలకేంద్రంలో మంగళవారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో మండలకేంద్రంలోని పలు కాలనీల్లో ఇండ్లలోకి వరద నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు.

'దిందా'కు రాకపోకలకు అంతరాయం

దిందా-కేతిని వాగుపై నిలిచిన నీళ్లు

చింతలమానేపల్లి, జూలై 30 : మండలంలోని దిందా గ్రామానికి రాపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు భారీగా నదికి నీళ్లు చేరడంతో నిండు కుండలా మారింది. దీంతో దిందా-కేతిని లో లేవల్ వంతెనపైకి బ్యాక్ వాటర్ చేరింది. దిందాకు సోమవారం అంతంత మాత్రంగా రాకపోకలు కొనసాగిన రాత్రి నుండి బ్యాక్ వాటర్ లోలేవల్ వంతెన పైకి రావడంతో రాపోకలు మళ్లీ నిలిచిపోయాయి.

'108'లో ప్రసవం

కోటపల్లి, జూలై 30 : వేమనపల్లి మండలం సుంపుటం గ్రామానికి చెందిన కుకట్ల అనిత గర్భిణీ 108లో ప్రసవించింది. సోమవారం రాత్రి అనితకు పురిటి నొప్పులు రాగా వెంటనే 108కి సమాచారం అందించగా కోటపల్లి ఆంబులెన్స్ సుంపుటం గ్రామానికి చేరుకొని దవాఖానకు వస్తుండగా, అనితకు పురిటి నొప్పులు ఎక్కువ అవగా మల్లంపేట గ్రామం వద్ద 108 నిలిపివేసిన 108 ఈఎంటీ శహబాజ్ ఈ విషయాన్ని 108 ఉన్నతాధికారులకు తెలియజేయగా వారి సూచనల మేరకు ప్రసవం జరిపించగా, పడంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలిద్దరూ క్షేమంగా ఉండగా ఇద్దరిని చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సకాలంలో స్పందించి ప్రసవం జరిపించిన 108 ఈఎంటీ శహనాజ్, పైలెట్ సతీశ్‌లను 108 కార్యనిర్వహణ అధికారి బి సంపత్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్‌లు అభినందించారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జూలై 30 : గంజాయి కేసులో నలుగురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ప్రకాశ్ తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినట్లు, వారిని విచారించగా మంచిర్యాల హమాలీవాడకు చెందిన భుక్యా సారయ్య, అల్మెకర్ శ్యామ్, వెంకటేష్‌లని తెలుపగా ఆ ముగ్గురు గత కొంత కాలంగా చెడు అలవాట్లకు, గంజాయికి బానిసై తాము పనిచేయగా వచ్చిన డబ్బులు చెడు అలవాట్లకు జల్సాలకు సరిపోకపోవడంతో గత రెండు, మూడు నెలలుగా మహారాష్ట్ర బల్లర్శకు చెందిన ఎస్‌కే.రిజ్వాన్ పాన్‌షాప్ నడుపుతున్న వ్యక్తి వద్ద నుండి కిలోకు రూ.16వేల చొప్పున గంజాయిని కొని మంచిర్యాలకు తీసుకొచ్చి, చుట్టూ పక్కల ప్రాంతాల యువకులకు 20 గ్రాముల గంజాయి పాకెట్‌ని రూ.200లకు విక్రయిస్తున్నట్లు, అలాగే గంజాయిని సేవిస్తున్నట్లు వారి విచారణలో తేలిందన్నారు. వీరు ముగ్గురు ఈ నెల 28న రిజ్వాన్‌కు ఫోన్ చేసి గంజాయి కావాలని అడగగా అతను మంగళవారం మంచిర్యాల రైల్వే స్టేషన్ కు తీసుకవస్తున్నట్లు, రైల్వే స్టేషన్ సమీపంలో ఉండమని చెప్పగా, దీంతో సారయ్య, శ్యామ్, వెంకటేష్‌లు ముగ్గురు వచ్చి రైల్వేస్టేషన్ సమీపంలో రిజ్వాన్ కోసమై వేచిఉండగా, రెండు ప్యాకెట్లలో అర కిలో చొప్పున మొత్తం కిలో గంజాయిని బల్లర్శ నుంచి తీసుకొచ్చి ఒక పాకెట్ ను వీరు ముగ్గురికి రూ.8వేలకు అమ్మి రూ.4వేలు ముందుగా తీసుకొనగా మిగితా రూ.4వేలను సరుకును ముట్టజెప్పిన తరువాత ఇచ్చారన్నారు. మరొక ప్యాకెట్ గోదావరిఖని లో ప్రేమ్ అనే వ్యక్తికి ఇవ్వడానికి వెళ్తున్నట్లు తెలిపారన్నారు. అనంతరం ఆ నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1 కేజీ 100గ్రాముల గంజాయి, రూ.4వేల నగదు, 4మొబైల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు, నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలించగా మంచిర్యాల, సీసీసీ నస్పూర్, శ్రీరాంపూర్‌కు చెందిన గంజాయి సేవించే యువకుల కాంటాక్ట్ నంబర్లు ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరపరిచినట్లు వెల్లడించారు. ఇక్కడ పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ సనత్ పాల్గొన్నారు.

చెట్లు నరికిన కేసులో ముగ్గురికి రిమాండ్

వాంకిడి, జూలై 30 : మండలంలోని గణేశ్‌పూర్ బీట్ అటవీ ప్రాంతంలో 50 చెట్లు నరికిన కేసులో బైపటార్ గ్రామానికి చెందిన అజార్ మహ్మద్, ముజ్జు, గోవింద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వో(రేంజ్)అప్పల కొండ తెలిపారు. దర్యాపులో భాగంగా ముగ్గురి ఇండ్లల్లో తనిఖీ చేయగా చెట్లు నరికే యంత్రాలు లభ్యమయ్యాయి. వీరిని ఈ నెల 26న సిర్పూర్(టీ)కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువైందన్నారు. ఎఫ్ఎస్వో సత్యనారాయణ, ఎఫ్‌బీవో ఉమారాణి ఆధ్వర్యంలో నిందితులను మంగళ వారం ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

తహసీల్దార్ కు సన్మానం

రెబ్బెన, జూలై 30: రెబ్బెన మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం నూతనంగా వచ్చిన తహసీల్దార్ రామ్మోహన్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో సన్మానం చేశారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్, జూలై 30 : సింగరేణి సంస్థ లాబాలు వెంటనే ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 7 నెలలు గడుస్తున్న ఇంత వరకు తమకు గుర్తింపు పత్రం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, కార్యదర్శి ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, మారెపల్లి సారయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఏబీఏపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిరుమల్‌రావు

మంచిర్యాల అర్బన్/శ్రీరాంపూర్, జూలై 30 : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణా మంచిర్యాల జిల్లా వాసి బేతి తిరుమల్‌రావును నియమిస్తు జాతీయ కౌన్సిల్ జనరల్‌బాడీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. సోమవారం ఖమ్మంలో జరిగిన ఏబీఏపీ జాతీయ కౌన్సిల్, జనరల్‌బాడీ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కే అయ్యప్ప దాస్ ఏక గ్రీవంగా ఎన్నిక చేసి బాధ్యలు అప్పగించారు. తిరుమల్‌రావు తెలంగాణ ఏబీఏపీ అధ్యక్షుడిగా 4 సంవత్సరాల పాటు సమర్ధవంతంగా సేవలందించారని, అతని సేవలు జాతీయ స్థాయిలో వినియోగించుకోవాలనే జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించామని ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిరుమల్‌రావు ఎన్నిక పట్ల మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, ప్రధాన కార్యదర్శి ఎల్క సంతోష్, కోశాధికారి జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశంలు హర్షం వ్యక్తం చేశారు.

డీపీఆర్‌వోపై కేసు నమోదు

కాగజ్‌నగర్, జూలై 30: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అప్పటి డీపీఆర్‌వో కృష్ణమూర్తిపై కేసునమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ మహేందర్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆష్రఫ్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచురణ ఇవ్వడంతో వచ్చిన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు.

ఘనంగా బోనాల పండుగ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 30 : జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లోని మహిళలు, శివసత్తుల ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ర్యాలీగా చేరుకు కొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్ఈడీ టీవీ సెట్ల అందజేత

జన్నారం, జూలై 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులకు డిజిటల్ క్లాసుల నిర్వహన కోసం గుండ శ్రీలత సోదరుడు గుండ మాల్లికార్జున్ రూ. 25వేల విలువగల 43 ఇంచుల ఎల్ఈడీ టీవీలు ఎంఈవో విజయ్‌కుమార్ చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు.

కూలి డబ్బులు చెల్లించండి

తిర్యాణి, జూలై 30 : ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లించాలని మండలంలోని ఉపాధి హామీ కూలీలు సంబంధిత అధికారులను కోరారు. గత మే, జూన్‌లో చేపట్టిన సుమారు ఐదు నుంచి ఆరు వారాలకు సంబంధించి కూలీ డబ్బులు రావాల్సి ఉందని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

చింతలమానేపల్లి, జూలై 30 : మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజ్ గౌడ్ బదిలీపై వెళ్లగా నూతన తహసీల్దార్‌గా మునవర్ షరీఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడారు.

ఎస్టీపీపీ జీఎంకు వినతి

జైపూర్, జూలై 30 : మండలంలోని పెగడపల్లి గ్రామంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని పెగడపల్లి అంబేద్కర్ యువజన సేవా సమితి వారి ఆధ్వర్యంలో మంగళవారం ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఎస్టీపీపీ నిర్వాసిత గ్రామమైన పెగడపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద బస్‌షెల్టర్‌తో పాటు ఒక హ్యాండ్ బోర్ నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లేష్, జాయింట్ సెక్రటరీ గంగాధరి మధు, ప్రధానకార్యదర్శి ఎనగందుల రవి, కోశాధికారి రవి తేజ, ప్రధానకార్యదర్శి మోతె సాయికిరణ్ పాల్గొన్నారు.

108 మందికి గదుల కేటాయింపు

బెల్లంపల్లి, జూలై 30 : బెల్లంపల్లి పట్టణంలోని నూతన ఇంటిగ్రేటేడ్ మార్కెట్ భవన సముదాయంలో 108 మందికి గదులు కేటాయించనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇసుకడంప్ సీజ్

సిర్పూర్(టీ), జూలై, 30 : మండలంలోని రుద్రారం గ్రామ శివారులోని సిర్పూర్(టీ) గ్రామానికి చెందిన రషీద్ భారత్ ఫౌల్ట్రి ఫామ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను మంగళవారం సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్, ఆర్ఐ జుగాజిరావులు 12 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు.

ముందస్తు అరెస్టులు సరికాదు..

సిర్పూర్(టీ), జూలై 30 : రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం కమిటీ పిలుపు మేరకు మంగళవారం నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమం విజయవంతం అయిందనీ ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి దాహెగాం పవన్ కుమార్ అన్నారు.

కరపత్రాలు విడుదల

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 30 : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని వచ్చే నెల 6న ఢిల్లీలో చేపడుతున్న దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి మాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్ వద్ద దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

ఎమ్మెల్యే పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

మంచిర్యాల అర్బన్, జూలై 30 : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్ రావు పై బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని మంచిర్యాల పట్టణ కాంగ్రేస్ నాయకులు అన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయం అందేలా కృషి

రెబ్బెన, జూలై 30: మండల కేంద్రంలోని బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఇటీవల మృతి చెందిన లావుడ్య శాంతాబాయి, బొడ్డు శంకర్ కుటుంబాలను పరామర్శించిన అనంతరం ప్రభుత్వ సహాయం అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లావుడ్య రమేశ్, ఎస్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, పట్టణ అధ్యక్షుడు వనమాల మురళీ, నాయకులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

లక్షెట్టిపేట,జూలై 30: పట్టణంలోని మర్రిగూడలో విద్యుత్ షాక్ తగిలి చిలుక రాంకీ(26) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషన్ మృతి చెందినట్లు ఎస్సై సతీష్ మంగళవారం తెలిపాడు. మృతుడు లక్షెట్టిపేట మున్సిపాలిటీలో ఔట్ సోర్స్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. పనిలో బాగంగా దొంత కళ్యాణ్ అనే వ్యక్తి వ్యవసాయిబావి మోటర్‌కు వచ్చే వైరుకు కార్బన్ రావడంతో విద్యుత్ ఫోల్ పైకి ఎక్కి మరమ్మత్తులు జరుపుతుండగా విద్యుత్ ఫోల్‌పై నుంచి గ్రామంలోకి వచ్చే 11కేవి లైన్‌కు విద్యుత్ సరఫరా అయి విద్యుత్ షాక్ తగిలి ఫోల్ పైనుండి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతునికి ఇంకా పెళ్ళి కాలేదని మృతుని తల్లి రాజేశ్వరి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

వృద్ధురాలి ఆత్మహత్య

లక్షెట్టిపేట,జూలై 30: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బత్తుల రాంబాయి(87) అనే వృదురాలు అనారోగ్యం భరించలేక ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. అనారోగ్య కారణాలు, వృద్ధాప్యం భరించలేక ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతుని కొడుకు బత్తుల అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై-2 తానాజీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపాడు.

పారిశుధ్య కార్మికుల అరెస్ట్

కోటపల్లి, జూలై 30 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ తరలివెల్లిన కోటపల్లి మండలం గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులను మంగళవారం పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. వేతనాలు పెంచాలని, ప్రతి నెల సకాలంలో వేతనాలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌కు గ్రామ పంచాయితీ వర్కర్స్ బయలుదేరగా పోలీస్‌లు అరెస్ట్ చేశారు.

ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్, జూలై 30: కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకానగర్ కాలనీకి చెందిన కత్తెరపాక సృజన్ నిషేదిత ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నట్లు నిర్ధారించి అతన్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణప్రతాప్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ద్వారకానగర్‌కు చెందిన సృజన్ ప్రభుత్వ నిషేదిత అప్లికేషన్స్ ఉపయోగించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తూ నిషేదిత గేమ్స్ ఆడుతున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు అతని మొబైల్ తనిఖీ చేసి సట్టా మాట్కా ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నట్లు నిర్ధారించి మొబైల్, అతని వద్ద రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నామని పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు స్పష్టం చేశారు. ఈయన వెంట టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది మధు, రమేశ్, ఉన్నారు.